రోడ్లు ఛిద్రమై.. ప్రయాణం నరకమై



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ధర్మవరం నుంచి మరూరు వద్ద ఉన్న జాతీయ రహదారి వైపుకు వెళ్లే రహదారి. ఈ రహదారిపై రోజూ వందలాది వాహనాలు వెళుతుంటాయి. రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో వాహనదారులు తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిని ఎప్పుడు బాగు చేస్తారోనని వాహనదారులు ఎదురు చూస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది తుమ్మల రహదారి పరిస్థితి. ధర్మవరం నుంచి మల్లేనిపల్లి, సుబ్బారావుపేట, అప్రాచెరువు, సంగమేశ్వరం మీదుగా చెన్నైకి వెళ్లే జాతీయ రహదారిలో కలుస్తుంది. ఈ రహదారి బాగున్నప్పుడు ధర్మవరం నుంచి ముదిగుబ్బ, కదిరికి వెళ్లే వాహనాలు బత్తలపల్లి చుట్టి రాకుండా దగ్గరి దారి కావడంతో వందలాది వాహనదారులు ఈ రహదారిపై వెళ్లే వారు.



కంకర తేలిన మామిళ్లపల్లి -ధర్మవరం రహదారి

- నాసిరకం ప్యాచ్‌లతో నిధుల దుర్వినియోగం
- గ్రామీణ రోడ్ల అభివృద్ధికి గ్రహణం
- ప్రజలకు తప్పని అవస్థలు

ధర్మవరం రూరల్: ధర్మవరం నియోజకవర్గంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి గ్రహణం పట్టింది. రోడ్లు ఛిద్రమై...ప్రయాణం నరకమై వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రహదారులను అద్దంలా మారుస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పట్టించుకోలేదు. దీంతో గ్రామీణ ప్రాంత వాసులు గుంతలు పడిన రహదారులపైనే ప్రయాణం చేస్తూ ఇదెక్కడి నరకం రా? స్వామి అంటూ వాపోతున్నారు. గ్రామీణ రహదారులను కొత్తగా వేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి బడ్జెట్‌ను కేటాయించలేదు. కేవలం ప్యాచ్ వర్క్‌ల కోసం ధర్మవరం నియోజకవర్గానికి రూ.4 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో తాత్కాలికంగా ప్యాచ్ వర్క్‌లను చేపట్టారు. అయితే ప్యాచ్ వర్క్‌లు చేసి ఐదు నెలలు కూడా గడవకముందే అవి ఛిద్రమవుతున్నాయి. నాసిరకంగా పనులు చేయడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పాడ్డాయని నియోజకవర్గ ప్రజలు ఆరోపిస్తున్నారు.

పుట్టపర్తికి దగ్గర దారి..

మహారాష్ట్ర, హైదరాబాద్, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి పుట్టపర్తికి సత్యసాయి భక్తులు వాహనాల్లో వస్తుంటారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చే వారు జాతీయ రహదారి నుంచి మామిళ్లపల్లి మీదుగా ధర్మవరం చేరి అక్కడి నుంచి పుట్టపర్తికి వెళ్లుతుంటారు. అయితే ఈ రహదారి గుంతలు పడి అధ్వానంగా ఉండడంతో పుట్టపర్తికి వెళ్లే భక్తులతో పాటు వీఐపీలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని కొత్తగా నిర్మిస్తే పుట్టపర్తికి వెళ్లే వారికి ఇబ్బందులు ఉండవని వాహన దారులు అంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

నియోజకవర్గంలో చాలా రహదారులు గుంతలు పడిన మాట వాస్తవమే. ఇటీవల రూ.4 కోట్లతో ప్యాచ్ పనులు కూడా చేపట్టాం. వర్షాల కారణంగా లూజు మట్టి వున్న చోట రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ వైపు నుంచి పట్టణ పోలీస్ స్టేషన్ వరకు వున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నూతనంగా తారు రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలకు ప్రతి పాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. – సంజీవయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



కదిరిలో ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ధర్మవరంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్



రక్తదానం చేస్తున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి అర్బన్: మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనిమియా మసీదు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ జీవిమానుకూడలి, ఇక్బాల్ సర్కిల్, మెయిన్‌రోడ్, బైపాస్‌రోడ్ మీదుగా తిరిగి అనిమీయామసీదుకు చేరుకుంది. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరెడ్డితో పాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు అనిమియా మసీదులో రక్తదాన శిబిరం నిర్వహించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

ధర్మవరం అర్బన్: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ముస్లింలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మసీదు నమూనాను ప్రత్యేక వాహనంలో అలంకరించి ఊరేగించారు. ర్యాలీని వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ముస్లింలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మసీదుల కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: ప్రేమాభిమానాల వనంలో వికసించినదే ఇస్లాం అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా బత్తలపల్లి మండలంలోని పలువురు ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల్లో మహమ్మద్ ప్రవక్త జన్మదిన కేక్‌ను కట్ చేసి భక్తులకు పంచారు.

తాడిమర్రి: మండల కేంద్రంతో పాటు పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, నాయనపల్లి, దాడితోట, పిన్నదరి తదితర గ్రామాల్లో ముస్లింలు శుక్రారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరుపు కున్నారు. అనంతరం వారు ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి 6 నుంచి శనివారం ఉదయం 6 గంటలకు జాగారం చేశారు.

క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గజ్జల సోమశేఖరరెడ్డి ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రేపు ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం



మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి, నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించే ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయ పురస్కారాలకు సినిమా నటుడు వెల్లంకి నాగినీడు హాజరుకానున్నారని ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వివిధ కేడర్లలో విశేష సేవలు అందిస్తున్న 67 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎన్జీఓ హోంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందిస్తామన్నారు. ఆత్మీయ ట్రస్ట్, యూటీఎఫ్ ధర్మవరం జోన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు వెల్లంకి నాగినీడు రానున్నారని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయక్, నాయకులు ఆంజనేయులు, హరికృష్ణ, వెంకటకిశోర్, అమర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి ఓ యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నాగరాజు లక్ష్మీ చైతన్య ఈనెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

'సంస్కృతి'లో ఓనం వేడుకలు



పూల రంగవల్లులతో విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేరళ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వస్త్రధారణ, రంగవల్లులు, డ్యాన్స్‌లు చేస్తూ అలరించారు. కళాశాల ఆవరణలో పూలతో రంగవల్లులు అద్దారు. ప్రత్యేక దప్పులతో విద్యార్థులు అలరించగా విద్యార్థినులు కేరళ నృత్యాలు చేస్తూ మైమరపింపజేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. తిరువతిరా కళి, పులికలి, ఒనపట్టు తదితర నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకోటేశ్వరి, సంస్కృతి యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు



జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగేంద్రప్రసాద్

కదిరి అర్బన్: గురు పూజోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ చేతుల మీదుగా కదిరి మున్సిపాల్టీ మశానంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగేంద్రప్రసాద్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఎస్టీయూ నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, రామక్రిష్ణారెడ్డి, రవినాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రొద్దం



ట్రోఫీ అందుకుంటున్న రొద్దం జట్టు సభ్యులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ ఫైనల్‌లో రొద్దం జట్టు విన్నర్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఎన్‌పీ కుంట జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 115 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రొద్దం జట్టు 11 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి లక్ష్యం ఛేదించింది. రొద్దం జట్టు కెప్టెన్ నరేష్‌కుమార్ 60 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. యూటీఎఫ్ నాయకులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్, ఎంఈఓ రాఘవయ్య, వాణి తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సాతార్లపల్లిలో ప్రతాప్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: మండలంలోని వివిధ గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు ఈశ్వరయ్య, రవినాయక్, మాజీ కన్వీనర్ గంగాద్రితో కలిసి ఆయన గంగిరెడ్డి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆంజనేయులు కుమారుడు దేవోత్తమ(30) చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సాతార్లపల్లిలో టీడీపీ నేతల చేతిలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న రామచంద్రారెడ్డిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అదే గ్రామంలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న నేత భాస్కర్‌రెడ్డి కుమారుడు ప్రతాప్‌రెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బొంతలపల్లి గ్రామంలో బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాదుగురి కేశవ కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామంలో చిల్లగూర్ల రామచంద్ర నూతన గృహప్రవేశానికి హాజయ్యారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధ పడుతున్న ఆవుల శ్రీనివాసులును పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాక్షమ్మ, నాయకులు ఆదెప్ప, శంకరరెడ్డి, శ్రీనివాసులు, రామక్రిష్ణ తదితరులు ఉన్నారు.

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని వివేకానంద రోడ్డులో ఉన్న జ్యోతి జైలక్ష్మి తండ్రి వెంకటేషు(77) ఎనుములపల్లికి చెందిన ఎనుముల బయపరెడ్డి తండ్రి మునిలిరెడ్డి(92)మంగలి సుబ్రమణ్యం అన్న సుధాకర్(52) ప్రశాంతి గ్రామానికి చెందిన ఆదినారాయణ తండ్రి హోటల్ కుళ్లాయప్ప (77) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మృతుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుసుకుంటున్న ఎనుములపల్లి గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ సుజాత, మాల గోపాల్, బొగ్గుల చంద్రశేఖర్‌రెడ్డి భార్య లక్ష్మిదేవి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, కన్వీనర్ రవినాయక్, మాజీ కన్వీనర్లు మాధవరెడ్డి, గంగాద్రి, నాయకులు గోపాల్‌రెడ్డి, చెరువు ఓబుళరెడ్డి, బాబుల్‌రెడ్డి, నాగిరెడ్డి, నాగార్జున, గోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాలు సమాజాభివృద్ధికి తోడ్పడాలి



శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న కుల సంఘం నేతలు

ఎన్‌పీకుంట: కుల సంఘాలు కేవలం తమ వర్గానికే పరిమితం కాకుండా సమాజాభివృద్ధికి తోడ్పడాలని శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేటేడి ఈశ్వర్ అన్నారు. వంకమద్ది గ్రామంలో కుమ్మర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచ్ పేటేడి నరసింహులు ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కుల సంఘాలు సమాజంలో ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. శాలివాహనం కులస్తులు ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం చెందడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కుల వృత్తి చేసుకోడానికి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరుకు కృషి చేయాలని పలువురు కుల సంఘం నాయకులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సాగు నీటి సంఘం వైస్ చైర్మన్ నాగేంద్ర, శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్

కదిరి టౌన్: రైతులకు యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ విమర్శించారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతాంగానికి సకాలంలో ఎరువులు అందించకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి రాకముందు రైతే రాజు, రైతు లేనిదే రాజ్యం లేదని ప్రగల్బాలు పలికారని, అధికారంలోకి వచ్చాక రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. జిల్లాకు తగినంత యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి రైతుకు రూ.20 వేలు సాయం తక్షణం విడుదల చేయాలన్నారు. పాలకు మద్దతు ధర కల్పించాలన్నారు. రైతు సమస్యలపై ఈనెల 8న అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు కార్యక్రమంలో నాయకులు నల్లజోడు పవన్, మనోహర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచండి



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

తాడిమర్రి: రైతులకు యూరియా కొరత రాకుండా అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఏడీఏ లక్ష్మానాయక్ ఎరువుల దుకాణదారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన వ్యవసాయ అధికారులు, పోలీసులతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎరువుల లభ్యత, నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులు సమయానికి అందుబాటులో ఉంచుతామన్నారు. తనిఖీల్లో ఎటువంటి వ్యత్యాసాలు లేవని అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి పాడి ఆవు మృతి



మృతి చెందిన ఆవు

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి సమీపంలోని దేవరచెరువు వద్ద 11కెవీ విద్యుత్ లైన్ తీగ తగిలి ఆవు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు అనిల్‌నాయుడు కొద్ది రోజుల క్రితం రూ.98 వేలతో జెర్సి ఆవు కొన్నాడు. శుక్రవారం మేతకు వెళ్లిన ఆవు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో అనిల్‌నాయుడు తమ పొలం పరిసర ప్రాంతంలో వెతకగా దేవరచెరువు వద్ద జంబులో విద్యుత్ స్తంభం నుంచి తెగి వేలాడుతున్న విద్యుత్ తీగకు తగిలి ఆవు మృతి చెందినట్లు గుర్తించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో తమ ఆవు మృతి చెందిందని రైతు వాపోయాడు. ఉదయం, సాయంత్రం 18 లీటర్ల పాలు ఇచ్చేదని, ఆవు మృతి చెందడంతో తాము జీవనోపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని రైతు కోరాడు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న బీజేపీ నేతలు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రావతి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తే భూగర్భజలాలు అడుగంటిపోయి తాగునీరు కూడా దొరకకుండా పోయి ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో ఇసుక అక్రమంగా అధికంగా తరలిస్తున్నారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోని ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకుల జ్యోతిప్రసాద్, సరేంద్రబాబు, బాలగంగాధర్, రామాంజనేయులు, కళ్యాణ్, నారాయణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నబీస్వామి ఉరుసు



అలంకరణలో నబీస్వామి దర్గా

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 17వార్డు బీడుపల్లిలో నబీస్వామి దర్గాలో ఉరుసు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం దేశ్‌ముఖ్ ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. శుక్రవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నబీస్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి మంచి జరుతుందని, అనుకొన్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. రాత్రి మతపెద్దలు భక్తులకు ఖురాన్ పుస్తకం చదివించి సారాంశం వినిపించారు. ఉరుసు సందర్భంగా దర్గా చుట్టూ వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులు, భక్తులతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం: పట్టణంలోని ఉషోదయ పాఠశాలలో శుక్రవారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు రిటైర్డ్ ఉపాధ్యాయులైన పెనుజూరు సుబ్బరత్నమ్మ, దాసరి నాగేంద్ర కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, సహాయ కార్యదర్శి రమేష్‌బాబు, సభ్యులు చాంద్‌భాషా, వైకే శ్రీనివాసులు, కోటేశ్వర రావు, ప్రసాద్, మల్లికార్జున, ఖలీల్, సికిందర్, కేతా లోకేష్‌లు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి వెంకటేష్‌కుమార్, జోనల్ చైర్మన్ వేణుగోపాలాచార్యులు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా 30 సంవత్సరాలు సేవలందించిన ఉపాధ్యాయులు విశ్వరూప్, సుధాకర్, ఓబిలేసు, గోవింద్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు రాధాకృష్ణ, శివప్రసాద్, చందా నాగరాజు, వెంకట పార్థసారధి, శివకృష్ణ పాల్గొన్నారు. పట్టణంలోని లయోలా పాఠశాలలో కరస్పాండెంట్ శంకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గానగర్‌లోని ఎస్సీ బాలికల వసతిగృహంలో పదవీవిరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు టీఎం నూర్జహాన్, లక్ష్మినారాయణరెడ్డిని సంస్థ చైర్మన్ నారాయణమూర్తి, అధ్యక్షుడు జగ్గా వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మంజునాథ్, కోశాధికారి చంద్రశేఖర్, సలహాదారులు మనోహర్‌గుప్త, హాస్టల్ వార్డెన్ లతలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

బత్తలపల్లి: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల, శ్రీజ్యోతి హైస్కూల్‌లో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో ప్రిన్సిపాల్ దేవరకొండ మాధవి, ప్రధానోపాధ్యాయుడు మిడతల లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయ దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల యజమాని విశ్వరూప ఆచారీ, శ్రీజ్యోతి హైస్కూల్‌లోని ఉత్తమ ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, లక్ష్మీ, సువర్ణలను ఘనంగా సన్మానించారు.